క్లుప్తంగా

శరవేగంగా సీసీ రోడ్డు పనులు


సిమెంట్ రోడ్డు నిర్మాణ పనులు చేస్తున్న కూలీలు

నాయుడుపేటటౌన్: పట్టణంలోని బజారు కూడలి వీధిలో సిమెంట్ రోడ్డు నిర్మాణ పనులు శరవేగంగా చేస్తున్నారు. సుమారు రూ.30 లక్షలతో డ్రైనేజీ కాలువ, సీసీ రోడ్డు పనులు సాగుతున్నాయి. ఈ పనులను మున్సిపల్ వైస్ చైర్మన్ వెంకటకృష్ణారెడ్డి, కౌన్సిలర్ పీ చంద్రారెడ్డి పర్యవేక్షించారు.

సెలవులు సద్వినియోగం చేసుకోవాలి


మాట్లాడుతున్న నాగేశ్వరావు

రాపూరు: దసరా సెలవులను చిన్నారులు సద్వినియోగం చేసుకోవాలని సిద్దవరం జెడ్పీ ఉన్నత పాఠశాల హెచ్ఎం నాగేశ్వరావు పేర్కొన్నారు. రాపూరు గ్రంథాలయంలో మంగళవారం ఆయన మాట్లాడారు. విద్యార్థుల కోసం గ్రంథాలయంలో కథలు, స్వాతంత్ర సమయయోధుల జీవిత చరిత్రలు ఉన్నాయని వాటిని సద్వినియోగం చేసుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో గ్రంథాలయాధికారిణి ధనమ్మ, సిబ్బంది వెంకటేశ్వర్లు, చిన్నారులు పాల్గొన్నారు.

భవన ఆక్రమణపై విచారణ

కోట: చిట్టేడులోని అంబేద్కర్ భవనాన్ని తహసీల్దార్ పద్మావతి,ఎంపీడీఓ భవానీ మంగళవారం పరిశీలించి, ఆక్రమణలపై విచారణ జరిపారు. వారు మాట్లాడుతూ అంబేద్కర్ సామాజిక భవనాన్ని ఆక్రమించిన వారిపై చర్యలు తీసుకుంటామని తెలిపారు. మంగళవారం గ్రామస్తుల ఫిర్యాదు మేరకు అధికారులు ఆక్రమణలు తొలగించామన్నారు. భవనాన్ని పంచాయతీ అధికారులకు అప్పగించామని, అంబేద్కర్ భవనానికి పూర్తి రక్షణ కల్పించి వినియోగంలోకి తెస్తామని తెలిపారు.

కండలేరులో 11.579 టీఎంసీలు

రాపూరు: కండలేరు జలాశయంలో మంగళవారం నాటికి 11.579 టీఎంసీ నీరు నిల్వ ఉన్నట్లు జలాశయం ఈఈ విజయకుమార్‌రెడ్డి తెలిపారు. హెడ్‌రెగ్యులేటర్ నుంచి సత్యసాయిగంగకు 40, పిన్నెరువాగుకు 5, మొదటి బ్రాంచ్ కెనాల్‌కు 5, లోలెవల్ స్లూయిస్‌కు 10 క్యూసెక్కుల వంతున నీటిని విడుదల చేస్తున్నట్లు పేర్కొన్నారు.

రెండు కిలోల వెండి కిరీటం వితరణ


వెండి కిరీటం అందజేస్తున్న దాతలు

చిట్టమూరు : మండలంలోని మల్లాంలో వెలసిన శ్రీవల్లీ దేవసేన సమేత సుబ్రమణ్యేశ్వరస్వామి వారికి మంగళవారం చెన్నైకు చెందిన శ్రీరమణ రైస్ ట్రేడర్స్ యజమాని ఏఎస్ జయకృష్ణ, షాలిని దంపతులు రెండు కేజీల వెండి కిరీటాన్ని వితరణగా అందించారు. వారు మాట్లాడుతూ ఆలయాభివృద్ధికి తమ వంతు సహకారం అందిస్తామన్నారు. కార్యక్రమంలో ఆలయ కమిటీ చైర్మన్ చిల్లకూరు సాయిరెడ్డి, ఈఓ శశాంక్ పాల్గొన్నారు.

అన్నదానం

గూడూరురూరల్ : పట్టణంలోని కల్యాణ వీరభద్రస్వామి దేవస్థానంలో మంగళవారం అన్నదాన సేవా సమితి ఆధ్వర్యంలో భక్తుకు అన్నదానం చేశారు. ఈ కార్యక్రమానికి దాసరాజు సూర్యనారాయణ, జాహ్నవి ఉభయకర్తలుగా వ్యవహరించారు.

సూచిక బోర్డుల ఏర్పాటు


నరసారెడ్డి కండ్రిగ వద్ద ఏర్పాటు చేసిన సూచిక బోర్డులు

నాయుడుపేట: చెన్నై– కోల్‌కతా జాతీయ రహదారిలోని పలు కూడళ్ల వద్ద సూచిక బోర్డులు ఏర్పాటు చేస్తున్నారు. ఈ రహదారిలో తరచూ ప్రమాదాలు జరుగుతుండడంతో స్థానిక ప్రజాప్రతినిధులు ద్వారా తెలుసుకున్న తిరుపతి ఎంపీ మద్దెల గురుమూర్తి వెంటనే జాతీయ రహదారుల సంస్థ ప్రాజెక్టు డైరెక్టర్‌తో మాట్లాడారు. ప్రమాదాల నివారణకు చర్యలు చేపడుతూ సూచిక బోర్డులు ఏర్పాటు చేయాలని ఎంపీ గురుమూర్తి ఎన్‌హెచ్ అధికారులకు సూచించారు. దీనిపై స్పందించిన ఎన్‌హెచ్ అధికారులు నాయుడుపేట పట్టణ పరిధిలోని అన్నమేడు క్రాస్ రోడ్డు, నరసారెడ్డికండ్రిగ, చంద్రబాబు కాలనీ, మల్లాం జాతీయ రహదారి కూడలి తదితర ప్రాంతాల్లో సూచిక బోర్డులు ఏర్పాటు చేశారు. సమస్యలపై సత్వరమే స్పందించిన ఎంపీ గురుమూర్తికి నాయుడుపేట ప్రాంత ప్రజలు కృతజ్ఞతలు తెలిపారు.

దశదిశలా సంబరాలు



సూళ్లూరుపేట రూరల్: అన్నపూర్ణగా చెంగాళమ్మ, సారె ఊరేగింపులో పాల్గొన్న భక్తులు


రాపూరు: ధాన్యలక్ష్మీదేవి అలంకరణలో ఆదిలక్ష్మి


రాపూరు: అన్నపూర్ణాదేవి అలంకారం


డక్కిలి: గాయత్రీదేవిగా పార్వతీదేవి


వెంకటగిరిరూరల్: వరహావతారంలో శ్రీనివాసుడు


రాపూరు: గాయత్రీదేవిగా అంకమ్మ

వెంకటగిరి, గూడూరు, సూళ్లూరుపేట నియోజకవర్గాల వ్యాప్తంగా శరన్నవరాత్రి ఉత్సవాలు వైభవంగా సాగుతున్నాయి. పలు ఆలయాల్లో అమ్మవార్లు రోజుకో అలంకారంలో భక్తులను కటాక్షిస్తున్నారు. భక్తకోటి అమ్మవార్లకు ప్రణమిల్లి.. మొక్కులు తీర్చుకుంటున్నారు.

అన్నపూర్ణ అలంకారంలో చెంగాళమ్మ

సూళ్లూరుపేట రూరల్: చెంగాళమ్మ ఆలయంలో జరుగుతున్న శరన్నవరాత్రి ఉత్సవాల్లో భాగంగా అమ్మవారు భక్తులకు అన్నపూర్ణ అలంకారంలో దర్శనమిచ్చారు. మన్నారుపోలూరు, సూళల పాళెం, వట్రపాళెం నుంచి ఊరేగింపుగా సారె తీసుకువచ్చి అమ్మవారికి సమర్పించారు.

ధాన్యలక్ష్మి అలంకరణలో ఆదిలక్ష్మీదేవి

రాపూరు: పెంచలకోనలోని ఆదిలక్ష్మీదేవి అమ్మవారు శరన్నవరాత్రి ఉత్సవాల్లో భాగంగా మంగళవారం ధాన్యలక్ష్మీదేవి అలంకరణలో భక్తులకు దర్శనమిచ్చారు. రాత్రి ఆదిలక్ష్మీదేవికి క్షేత్రోత్సవం నిర్వహించారు. రాపూరులోని కన్యకాపరమేశ్వరిని అన్నపూర్ణదేవి అలంకరించారు. వేపినాపి సమీపంలోని అంకమ్మను గాయత్రీదేవిగా అలంకరించారు.

త్రిపురసుందరిగా కోటమ్మ

కోట: గ్రామదేవత కోటమ్మ మంగళవారం త్రిపుర సుందరి అలంకారంలో భక్తులకు దర్శనమిచ్చారు.

అమ్మవార్లకు ప్రత్యేక పూజలు

నాయుడుపేటటౌన్: శరన్నవరాత్రి ఉత్సవాల్లో భాగంగా పలు ఆలయాల్లో అమ్మవార్లకు పలు అలంకరణ చేసి, ప్రత్యేక పూజలు నిర్వహించారు. పోలేరమ్మవారు గాయత్రీదేవిగా, మూకాంబికాదేవి పార్వతీదేవిగా, వాసవీ కన్యకా పరమేశ్వరిదేవి మోహినీగా, దుర్గామల్లేశ్వరిదేవి అన్నపూర్ణ దేవిగా దర్శనమిచ్చారు.

గాయత్రీదేవి అలంకారంలో పార్వతీదేవి

డక్కిలి: మండలంలోని దేవునివెల్లంపల్లె ఉన్న స్తంభాలగిరీశ్వరయ్యస్వామి ఆలయంలో పార్వతీదేవి గాయత్రిదేవిగా భక్తులకు దర్శనమిచ్చారు. నాగవోలుకు చెందిన పోలు సురేష్ సరిత దంపతులు, కమ్మపల్లెకు చెందిన నర్రావుల కోటేశ్వరరావు ,గౌతమి దంపతులు ఉభయకర్తలుగా వ్యవహరించారు.

అన్నపూర్ణ..ఆదిలక్ష్మి

చిల్లకూరు: కలవకొండలోని లక్ష్మీనరసింహస్వామి ఆలయంలో ఉన్న ఆదిలక్ష్మి అమ్మవారికి అన్నపూర్ణగా భక్తులను కటాక్షించారు. ఆలయ అర్చకులు చిరంజీవిస్వామి, వాసవి దంపతులు ఉభయకర్తలుగా వ్యవహరించారు. ముత్యాలమ్మ ఆలయంలో అమ్మవారు గాయత్రీదేవిగా దర్శనమిచ్చారు. దొరువుకట్టకు చెందిన దువ్వూరు రమణారెడ్డి కుటుంబ సభ్యులు ఉభయకర్తలుగా వ్యవహరించారు.

గౌరీదేవిగా బాలాత్రిపుర సుందరి

సైదాపురం: బాలాత్రిపుర సుందదేవి అమ్మవారు మంగళవారం గౌరీదేవి అలంకరణలో భక్తులకు దర్శనమిచ్చారు. ఉదయం అభిషేకం, పూలంగి సేవ, లలిత సహస్రపారాయణం, రుద్రాభిషేకం చేశారు.

గాయత్రీదేవి అలంకారంలో రాజరాజేశ్వరి

గూడూరురూరల్: పట్టణంలోని శ్రీరాజరాజేశ్వరి అమ్మవారు గాయత్రీదేవి అలంకారంలో భక్తులకు దర్శనమిచ్చారు. బజారు వీధిలోని వాసవీ కన్యకా పరమేశ్వరి, శ్రీసాయిసత్సంగ నిలయంలో శ్రీ విజయదుర్గ, రాజావీధిలోని గంగమ్మ, సొసైటీకాలనీలోని నారాయణమ్మ పేరంటాళ్లు అమ్మవార్లు గాయత్రీ దేవి అలంకారాల్లో భక్తులకు దర్శనమిచ్చారు.

కొలువు దీరిన అమ్మవార్లు

వెంకటగిరిరూరల్: దేవి శరన్నరాత్రి ఉత్సవాల్లో భాగంగా అమ్మవార్లు మంగళవారం అమ్మవార్లు విభిన్న అలంకారంలో కొలువు దీరారు. వేంకటేశ్వరస్వామి ఆలయంలోని కాత్యాయని అన్నపూర్ణదేవిగా, గాయత్రి వరహా అవతారంలో శ్రీనివాసుడు, వెలమపాళెంలోని మందనాచారమ్మ వైష్ణవీదేవిగా, కళ్యాకాపరమేశ్వరి మోహిని అలంకారంలో భక్తులకు దర్శన మిచ్చారు.


గూడూరు రూరల్: వాసవీ కన్యకా పరమేశ్వరి, గాయత్రీదేవిగా రాజరాజేశ్వరి, చిల్లకూరు: అన్నపూర్ణ అలంకరణలో ఆదిలక్ష్మి, వెంకటగిరిరూరల్: అన్నపూర్ణదేవిగా కాత్యాయని, సైదాపురం: గౌరీ అలంకరణ, కోట:త్రిపుర సుందరిగా కోటమ్మ, నాయుడుపేటటౌన్: మూకాంబికాదేవికి పార్వతీదేవి అలంకారం, గాయత్రీదేవిగా పోలేరమ్మ

అసత్య ఆరోపణలు నీతిమాలిన చర్య


మాట్లాడుతున్న ఎమ్మెల్యే సంజీవయ్య, నాయకులు

నాయుడుపేటటౌన్: సీఎం జగన్‌మోహన్‌రెడ్డిపై అసత్య ఆరోపణలు చేయడం నీతి మాలిన చర్య అని ఎమ్మెల్యే కిలివేటి సంజీవయ్య అన్నారు. నాయుడుపేటలోని ఆర్అండ్‌బీ అతిథి గృహంలో మంగళవారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఎమ్మెల్యే మాట్లాడారు. స్కిల్ డెవలప్‌మెంట్ కేసును పక్కదారి పట్టించడానికే ఇలాంటి చర్యలకు పాల్పడుతున్నారని ఆరోపించారు. రాష్ట్రంలో నిబంధనల మేరకే ఇసుక టెండర్లు జరిగాయని, వేలంలో రీచ్‌లు దక్కించుకున్న వారు ప్రభుత్వానికి అన్ని శిస్తులు పక్కాగా చెల్లిస్తున్నారని చెప్పారు. అయితే ఆంధ్రజ్యోతి పత్రికలో ఇసుక టెండర్లపై తప్పుడు రాతలు రాసి, సీఎం సోదరుడిపై ఆరోపణలు చేయడం మంచి పద్ధతి కాదన్నారు. అలాగే సోషల్ మీడియాలో అసభ్య పదజాలంతో పోస్టులు పెడుతున్నారని, వీటికి సంబంధించిన బాధ్యులపై చర్యలు తప్పవన్నారు. చంద్రబాబు అవినీతి బాగోతం కప్పి పుచ్చుకునేందుకు సీఎం వైఎస్ జగన్‌మోహన్ రెడ్డిపై అర్థం పర్థం లేని ఆరోపణలు చేయడం ఇప్పటికైనా మార్చుకోవాలని ఎమ్మెల్యే హితవు పలికారు. వైఎస్సార్ సీపీ మండల కన్వీనర్ టీ సుబ్రహ్మణ్యంరెడ్డి, ఏఎంసీ చైర్మన్ టీ జనార్దన్‌రెడ్డి, ఎంపీపీ ధనలక్ష్మి, రత్నశ్రీ , నాయకులు కే రాజారెడ్డి, కే మాధవ రెడ్డి, పీ హరినాథ్‌రెడ్డి పాల్గొన్నారు.

చేపల చెరువు వేలం

పెళ్లకూరు: మండలంలోని చెంబేడు చెరువులో చేపలు పట్టుకోవడానికి 2023–24 సంవత్సరానికి సంబంధించి మంగళవారం వేలంపాట నిర్వహించారు. సచివాలయ ప్రాంగణంలో నిర్వహించిన బహిరంగ వేలం పాటలో గ్రామానికి చెందిన కోబాక రమణయ్య రూ.2.75 లక్షలకు దక్కించుకున్నాడు. స్థానిక సర్పంచ్ పీ ధర్మయ్య, పంచాయతీ కార్యదర్శి శ్రీరామ్, వెంకటరత్నం పాల్గొన్నారు.

చికిత్స పొందుతూ మహిళ మృతి

కోట: ఆత్మహత్యాయత్నానికి పాల్పడి నెల్లూరులో చికిత్స పొందుతున్న లక్ష్మక్కకండ్రిగ గ్రామానికి చెందిన ఎస్.మీనా(38) మంగళవారం మృతి చెందినట్లు ఎస్ఐ పుల్లారావు తెలిపారు. అనారోగ్య కారణాలతో సోమవారం ఇంట్లో ఎవరూ లేని సమయంలో ఆమె విషపు గుళికలు తిన్నట్లు తెలిపారు. ఈ మేరకు కుటుంబసభ్యులు నెల్లూరులోని ప్రైవేట్ వైద్యశాలలో చికిత్స పొందుతూ మృతి చెందినట్లు తెలిపారు. తండ్రి వెంకటేశ్వర్లు ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ తెలిపారు.

పశుపోషణపై అవగాహన

కోట: మండలంలోని సిద్ధవరంలో మంగళవారం పశు విజ్ఞానబడి కార్యక్రమం నిర్వహించారు. పశు సంవర్థకశాఖ ఏడీ సుబ్రమణ్యం హాజరై, రైతులకు పశుపోషణపై అవగాహన కల్పించారు. వైద్య సిబ్బంది రమణ పాల్గొన్నారు.

ప్రతి గడపకూ సంక్షేమ పథకాల లబ్ధి


సంక్షేమ పథకాలపై లబ్ధిదారులకు అవగాహన కల్పిస్తున్న నేదురుమల్లి రామ్‌కుమార్‌రెడ్డి

వెంకటగిరిరూరల్: ప్రతిపేద కుటుంబానికి సంక్షేమ పథకాలు లబ్ధి చేకూరిందని, దీంతో సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రజల గుండెల్లో చోటు సంపాదించుకున్నారని వైఎస్సార్‌సీపీ తిరుపతి జిల్లా అధ్యక్షుడు నేదురుమల్లి రామ్‌కుమార్‌రెడ్డి తెలిపా రు. పట్టణంలోని బంగారుపేట సచివాలయం పరిధిలోని బీసీ కాలనీలో మంగళవారం గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో పాల్గొన్న నేదురుమల్లి స్థానికుల సమస్యలు ఆలకిస్తూ వాటిని పరిష్కారానికి సంబంధిత అధికారులకు దిశానిర్దేశం చేశారు. ఈ కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ పట్టణ కన్వీనర్ జి ఢిల్లీబాబు, వైస్ చైర్మన్ ఎస్ బాలయ్య, కౌన్సిలర్ సుబ్బారావు, కే కళ్యాణి, న్యాయవాది ఎల్ కోటేశ్వరరావు, నాయకులు వీ కృష్ణయ్య, ఏ గోపాల్, ఎం వెంకటేశ్వర్లు, కాటయ్య, శివకుమార్, నాగరాజు తదితరులు పాల్గొన్నారు.

పేదల అభ్యున్నతే లక్ష్యంగా పాలన

రాపూరు: సీఎం జగన్‌మోహన్‌రెడ్డి పేదల అభ్యున్నతే లక్ష్యంగా సంక్షేమ పాలన అందిస్తున్నారని వైఎస్సార్ సీపీ తిరుపతి జిల్లా అధ్యక్షుడు నేదురుమల్లి రామ్‌కుమార్‌రెడ్డి అన్నారు. రాపూరు మండలంలోని నెల్లేపల్లి, వెలుగోను గ్రామాల్లో మంగళవారం గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ నాయకులు పీ మధుసూదన్‌రెడ్డి, మండల కన్వీనర్ పీ దయాకర్‌రెడ్డి, జేసీఎస్ మండల కన్వీనర్ డీ నారాయణరెడ్డి , వ్యవసాయ సలహా మండలి చైర్మన్ ఎస్ రవీంద్రారెడ్డి, ఎస్ సురేష్‌రెడ్డి, పాల్గొన్నారు.

ముత్యాలమ్మకు వెండి మకరణతోరణం


వెండి మకరణతోరణం అందజేస్తున్న దాతలు

చిల్లకూరు: తూర్పుకనుపూరులోని ముత్యాలమ్మ ఉత్సవమూర్తికి మకరణతోరణాన్ని దాతలు బహూకరించారు. ఆలయంలో జరిగిన ఈ కార్యక్రమంలో దొరువుకట్టకు చెందిన దువ్వూరు రమణారెడ్డి, ఈశ్వరమ్మ దంపతులు అమ్మవారి ఉత్సవమూర్తికి 679 గ్రాముల వెండి మకరణ తోరణాన్ని వైఎస్సార్ సీపీ రాష్ట్ర కార్యదర్శి పీ శ్యాంప్రసాద్‌రెడ్డి, విత్తనాభివృద్ధి సంస్థ మాజీ చైర్‌పర్సన్ హేమ సుస్మితారెడ్డి చేతులు మీదుగా ఆలయ ట్రస్టు బోర్డు చైర్‌పర్సన్ సీ ఇంద్రసేనమ్మకు అందజేశారు. ఈ సందర్భంగా పేర్నాటి మాట్లాడుతూ ఆలయాభివృద్ధిలో దాతలు తమ వంతు సహకారం అందిస్తున్నారన్నారు. ఈ కార్యక్రమంలో ఆలయ ఈఓ నవీన్‌కుమార్, కమిటీ సభ్యులు దువ్వూరు చంద్రరెడ్డి, సాయిరెడ్డి, ఆలయ అర్చకులు శివకుమార్ తదితరులు పాల్గొన్నారు.

చేనేతకు చేయూతనిస్తున్నారు!


ప్రతినిధులతో మాట్లాడుతున్న సుబ్రమణ్యం

సైదాపురం(వెంకటగిరి): వెంకటగిరి చేనేత కుటుంబాలకు సీఎం జగన్‌మోహన్‌రెడ్డి చేయూత నిస్తున్నారని ఓ చేనేత కార్మికుడు మంగళవారం ఇన్వెస్ట్ ఇండియా టీమ్ కమిటీ ప్రతినిధి జగీష్ తివారి మిశ్రాకు వివరించారు. ఓపెన్ ఇండియా ఒన్ ప్రొడెక్ట్ అవార్డు 2023 ప్రతిష్టాత్మకంగా జరిగే పోటీల్లో వెంకటగిరి చేనేత ఉత్పత్తులు, ప్రాముఖ్యతలపై వెంకటగిరిలో ఇన్వెస్ట్ ఇండియా టీమ్ కమిటీ ప్రతినిధులు, తిరుపతి జిల్లా కలెక్టర్ వెంకటరమణారెడ్డి వెంకటగిరిలో పర్యటించారు. ఈ సందర్భంగా వారు చేనేత కార్మికులతో మాట్లాడారు. పట్టణానికి చెందిన పట్నం సుబ్రమణ్యం అనే చేనేత కార్మికుడు మాట్లాడుతూ రాష్ట్రంలో వైఎస్సార్ సీపీ అధికారంలోకి వచ్చిన తర్వాత చేనేత కార్మికుల కుటుంబాలు ఆనందంగా జీవిస్తున్నాయని, తన మనస్సులో మాటలను ఆ ప్రతినిధికి తెలియజేశారు. ఏటా ప్రభుత్వం నుంచి నేరుగా నేతన్న నేస్తం పథకం ద్వారా తమ ఖాతాల్లోకి రూ.24 వేలు నగదు ప్రోత్సాహకం అందించడం ఎంతో ఆనందంగా ఉందన్నారు. అలాగే గతంలో తాను కూలిగా పని పనిచేసే వాడినని, కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల ప్రోత్సాహంతో తానే స్వయంగా 20 చేనేత మగ్గాలను ఏర్పాటు చేసుకుని వ్యాపారంలో రాణిస్తున్నానని తెలిపారు.

వైఎస్సార్‌సీపీ గెలుపే లక్ష్యంగా పనిచేద్దాం

సైదాపురం(వెంకటగిరి): అందరం కలిసి నడుద్దాం. . ప్రతి ఇంటికీ వెళదాం.. జగనన్న సంక్షేమ పాలనను వివరిద్దాం.. వైఎస్సార్ సీపీ గెలుపే లక్ష్యంగా పనిచేద్దామని ఆ పార్టీ తిరుపతి జిల్లా అధ్యక్షుడు నేదురుమల్లి రామ్‌కుమార్‌రెడ్డి పిలుపునిచ్చారు. ఎన్‌జీఆర్ భవనంలో ఆంధ్రప్రదేశ్‌కి జగనే ఎందుకు కావాలంటే అనే కార్యక్రమంపై మంగళవారం బాలాయపల్లె మండలంలోని వైఎస్సార్ సీపీ ప్రజాప్రతినిధులు, కౌన్సిలర్లు, గృహ సారథులు, సచివాలయ కన్వీనర్లు, వలంటీర్లు, సోషల్ మీడియా కమిటీ సభ్యులు, గ్రామ స్థాయి నేతలతో సమావేశం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో మండల కన్వీనర్ వీ కార్తీక్‌రెడ్డి, వైస్ ఎంపీపీ పార్వతి, పీఏసీఎస్ అధ్యక్షుడు ఆర్ వెంకటకృష్ణమనాయుడు, మండల మాజీ కన్వీనర్ వెంకటసుబ్బయ్య, నేత రమేష్‌చౌదరి తదితరులు పాల్గొన్నారు.

ప్రజల చెంతకే మెరుగైన వైద్యం


డక్కిలి: ఆయుష్మాన్ భారత్ కార్డు అందజేస్తున్న నేదరుమల్లి రామ్‌కుమార్‌రెడ్డి


నాయుడుపేట: కిట్ అందజేస్తున్న సుధాకర్ రెడ్డి, ధనలక్ష్మి


నాయుడుపేటటౌన్: మందులు పంపిణీ చేస్తున్న కమిషనర్ శ్రీనివాసరావు

డక్కిలి: ప్రజల చెంతకే మెరుగైన వైద్యసేవలను చేర్చిన ఘనత సీఎం జగన్‌మోహన్‌రెడ్డికే దక్కుతుందని వైఎస్సార్ సీపీ తిరుపతి జిల్లా అధ్యక్షుడు నేదురుమల్లి రామ్‌కుమార్‌రెడ్డి అన్నారు. మంగళవారం మండలంలోని లింగసముద్రం సచివాలయంలో ఏర్పాటు చేసిన వైద్యశిబిరాన్ని ఆయన పరిశీలించారు. వైద్యాధికారి స్పందన ఆధ్వర్యంలో రోగులకు మందులను పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో ఎంపీపీ జీ రాజశేఖర్, జేసీఎస్ మండల కన్వీనర్ సీహెచ్ శ్రీనివాసులురెడ్డి, ఎంపీటీసీ సభ్యుడు ఎస్ కోటేశ్వరరావు, నాయకులు వీ మల్లికార్జున, గోవర్ధన్‌నాయుడు, కోటయ్య నాయుడు, ఎంపీడీఓ ప్రసన్నకుమారి, ఈఓపీఆర్డీ వెంకటాద్రి పాల్గొన్నారు.

మెరుగైన వైద్యసేవలే ప్రభుత్వ లక్ష్యం

నాయుడుపేట: ప్రజలకు మెరుగై వైద్యసేవలు అందించాలన్నదే లక్ష్యంగా జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమం చేపడుతున్నట్లు వైఎస్సార్ సీపీ అధికార ప్రతినిధి కట్టా సుధాకర్ రెడ్డి అన్నారు. మేనకూరులో మంగళవారం జగనన్న ఆరోగ్య సురక్ష వైద్య శిబిరం ఎంపీపీ ధనలక్ష్మి, జెడ్పీటీసీ సభ్యులు కే జ్యోతిరెడ్డి, సర్పంచ్ సీహెచ్ సురేష్‌తో కలసి ప్రారంభించారు. ఎంపీడీఓ శివప్రసాద్, పంచాయతీ కార్యదర్శి గోపాల్ తదితరులు పాల్గొన్నారు.

ఎంతో ఉపయోగకరం

చిల్లకూరు: జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమం పేద ప్రజలకు ఎంతో ఉపయోకరమని జెడ్పీటీసీ సభ్యుడు మన్నెం శీనయ్య అన్నారు. మండలంలోని తొణుకుమాల సచివాలయంలో జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఎంపీటీసీ సభ్యుడు జానకిరామ్, సర్పంచ్‌లు త్రివిక్రమ్ భూపతి, మల్లికార్జునరెడ్డి, ఈఓపీఆర్డీ మాణిక్యం పాల్గొన్నారు.

ప్రజారోగ్యానికి సీఎం జగన్ భరోసా

వాకాడు: ప్రజారోగ్యానికి సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి భరోసా ఇస్తున్నారని పీఏసీఎస్ అధ్యక్షుడు కే దామోదర్‌రెడ్డి పేర్కొన్నారు. మంగళవారం వాకాడు మండలం తిరుమూరులో జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమం నిర్వహించారు. సుమారు 320 మందికి వైద్యపరీక్షలు చేసి, మందులు అందజేశారు. ఎంపీడీఓ గోపీనాథ్, ఎంపీటీసీ సభ్యుడు కృష్ణారెడ్డి,సర్పంచ్ అనిల్‌రెడ్డి, సురేంద్రరెడ్డి పాల్గొన్నారు.

అపూర్వ అదరణ

నాయుడుపేటటౌన్: జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమానికి ప్రజల నుంచి అపూర్వ ఆదరణ లభిస్తుందని మున్సిపల్ కమిషనర్ శ్రీనివాసరావు అన్నారు. పట్టణంలోని తుమ్మూరు వైఎస్సార్ అర్బన్ హెల్త్ సెంటర్ వద్ద జగనన్న ఆరోగ్య సురక్ష వైద్యశిబిరం నిర్వహించారు. వైఎస్సార్ సీపీ నాయకులు షేక్ షబ్బీర్, కన్మణి తదితరులు పాల్గొన్నారు.

వెంకటరెడ్డిపాళెంలో సురక్ష

ఓజిలి: మండలంలోని వెంకటరెడ్డిపాళెం సచివాలయంలో మంగళవారం జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమం నిర్వహించారు. ఎంపీడీఓ రజనీకాంత్, వైద్యులు డానియల్ రాజు, హిమజ, వైఎస్సార్‌సీపీ మండల కన్వీనర్ పీ హరనాథ్‌రెడ్డి, సర్పంచ్ కే లలితమ్మ తదితరులు పాల్గొన్నారు.

తనియాలిలో..

దొరవారిసత్రం: తనియాలిలో జగనన్న ఆరోగ్య సురక్ష వైద్యశిబిరం అధికారులు నిర్వహించారు. రోగులను వైద్యులు పరీక్షించి మందులు అందజేశారు. వైద్యాధికారి చైతన్య, ఇన్‌చార్జి ఎంపీడీఓ రఘురామయ్య,సర్పంచ్‌లుసుబ్బమ్మ,చెంగయ్య పాల్గొన్నారు.

సద్వినియోగం చేసుకోవాలి

చిట్టమూరు: జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమాన్ని ప్రతి ఒక్కరు సద్వినియోగం చేసుకోవాలని ఉప్పలమర్తి సర్పంచ్ ఎన్ లావణ్య కోరారు. మండలంలోని ఉప్పలమర్తిలో మంగళవారం జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమం నిర్వహించారు. వైఎస్సార్‌సీపీ నాయకులు సుబ్బయ్య, ఆర్ఐ మధులత, వైద్యులు రాజేశ్వరి తదితరులు పాల్గొన్నారు.

ప్రజారోగ్యానికి పెద్దపీట

సైదాపురం: రాష్ట్ర ప్రభుత్వం ప్రజారోగ్యానికి పెద్దపీట వేస్తోందని ఎంపీడీఓ వెంకటేశ్వర్లు, తహసీల్దార్ శ్రీనివాసులు పేర్కొన్నారు. మండలంలోని పోతేగుంటలో జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమం నిర్వహించారు. ఏఓ పురుషోత్తం శివకుమార్, నేతలు శివారెడ్డి ,ఏఎన్ఎంలు పాల్గొన్నారు.